క్లుప్తంగా

ఆలిండియా సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక


క్రీడాకారుడు సురేంద్ర

ఆదోని అర్బన్: పట్టణంలోని అరుంజ్యోతి నగర్‌కు చెందిన కబడ్డీ క్రీడాకారుడు సురేంద్ర ఆలిండియా సెపక్‌తక్రా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ సభ్యులు అమర్‌ప్రకాష్, నాగరాజు, రవి, మారి తదితరులు క్రీడాకారుడు సురేంద్రను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో సురేంద్ర ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడని, మార్చి 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు మణిపూర్‌లో జరిగే ఆలిండియా సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటాడని వెల్లడించారు.

నేడు రథోత్సవం


ముస్తాబైన రథం

కోసిగి: మండల కేంద్రంలోని రంగప్ప గట్టు సమీపంలో వెలసిన గురుసుబ్బారూఢ స్వామి వారి 60వ మహా రథోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. పాల్గుణ శుద్ధ దశమి పురస్కరించుకుని వేకువజాము నుంచి ఆలయ కమిటీ కార్యదర్శులు మఠం చంద్రయ్య, బొంబాయి దయా ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణ, వెండి కవచ అలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేయనున్నారు. సాయంత్రం ఆలయం నుంచి పెండేకల్లు ఆంజనేయ స్వామి దేవాలయం వరకు మల్లికార్జున స్వామి పల్లకోత్సవం నిర్వహించి స్వామి వారి మూలవిరాట్‌ను రథంపై కొలువుంచి మేళతాళాలు డప్పువాయిద్యాలతో స్వామి వారి పాదాల వరకు లాగి తిరిగి యథావిధిగా గమ్యస్థానం చేర్చనున్నట్లు తెలిపారు. రథోత్సవ ఊరేగింపు మధ్యలో ఆలయ పూజారి భవిష్యవాణి వినిపిస్తారు. రాత్రి భజన కార్యక్రమం నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అప్పర్‌భద్ర ప్రాజెక్టును నిలిపివేయాలి

ఆదోని అర్బన్: అప్పర్‌భద్ర ప్రాజెక్టు పనులను నిలిపివేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆయన బహిరంగ సభలో మాట్లాడారు. ముందుగా స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్ నుంచి రిక్రియేషన్ క్లబ్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తుంగభద్ర ఉంటేనే రాయలసీమకు నీరు అందుతాయని, అప్పర్‌భద్ర ప్రాజెక్టును నిర్మిస్తే రాయలసీమ నాశనమవుతుందన్నారు. ప్రాజెక్టును నిర్మిస్తే రాయలసీమ గడ్డను నాశనం చేసినవారవుతారని పాలకులకు హితవు పలికారు. కృష్ణా, పెన్నా ప్రాజెక్టులు పూర్తి చేయాలని, సిద్ధేశ్వరం వద్ద తీగల వంతెన వద్దు – బ్రిడ్జి కం బ్యారేజీ కావాలని కోరారు.

పెట్రోల్ బంకుల తనిఖీ


పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్, పౌరసరఫరాశాఖ డీటీ వలీబాషా

ఆదోని రూరల్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా, లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆదోని మండలవ్యాప్తంగా 18 పెట్రోల్ బంకులు ఉండగా, ఇప్పటివరకు ఆరు పెట్రోల్ బంకులను తనిఖీ చేశామన్నారు. మిగిలిన 12 బంకుల్లో త్వరలో తనిఖీలు పూర్తి చేస్తామన్నారు. ఆదోని పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలోని రాయల్ పెట్రోల్‌బంకు, ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని సత్య పెట్రోల్ బంకును తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులో ఉండాల్సిన బాత్రూమ్స్, తాగునీరు, ఉచిత గాలి సదుపాయం, కార్బన్ డయాక్సైడ్ సిలిండర్, రిజిస్ట్రేషన్ రికార్డ్స్, పెట్రోల్, డీజిల్ నాణ్యత, ధరల పట్టికను పరిశీలించారు. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పెట్రోల్ బంకులకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే 1967 కమాండ్ కంట్రోల్ రూం, స్థానిక తహసీల్దార్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆదోని రూరల్: ఆదోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు సమావేశంలో పాల్గొనాలని కోరారు. అజెండాలో పేర్కొన్న అంశాలపై చర్చించి వాటి పరిష్కారానికి మార్గం చూపేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సొంతింటి కల సాకారం

- జోరుగా సాగుతున్న ఇంటి నిర్మాణాలు
- ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- తీరిన మంత్రాలయం వాసుల దశాబ్దాల కోరిక


మంత్రాలయంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

మంత్రాలయం: ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. పూరి గుడిసెలు.. డేరాలు.. బాడుగ ఇళ్లలో కాపురాల నుంచి పేదలకు ఉపశమనం లభిస్తోంది. పక్కా ఇళ్ల నిర్మాణాలతో పేదల జీవితాల్లో వెలుగులు ప్రసరించనున్నాయి. గత ప్రభుత్వాల పాలనను తలదన్నేలా జగనన్న కాలనీలు వెలుస్తున్నాయి. ఊళ్లను తలపించేలా ఆశల సౌదాలు రూపుదిద్దుకుంటున్నాయి. మంత్రాలయం నియోజకవర్గంలో కనివినీ ఎరుగని రీతిలో పక్కా ఇళ్ల పునాదులు వేసుకుంటున్నాయి.

నియోజకవర్గంలో 9,374 ఇళ్లు మంజూరు

మంత్రాలయం నియోజకవర్గంలో 112 గ్రామాలు, 3 మేజర్ గ్రామ పంచాయతీలు, 91 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు 2.50 లక్షలకు పైగా జనాభా ఉంది. తుంగభద్ర వరద ప్రభావిత గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లోనూ ఇళ్లు లేని పేదల సంఖ్య చాలానే ఉంది. గత ప్రభుత్వాలు ఇంటి నిర్మాణాలపై సరైన దృష్టి కేంద్రీకరించకపోవడంతో తూతూ మంత్రంగా నిర్మాణాలు సాగాయి. టీడీపీ హయాంలో పార్టీ అనుకూల వర్గాలకు మాత్రమే న్యాయం జరిగింది. అయితే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత పెరిగింది. ఎన్నికల హామీల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 36 లక్షల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. మంత్రాలయం నియోజకవర్గంలో 9,374 ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటివరకు 1,988 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయగా మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి.

నెరవేరిన దశాబ్దాల కోరిక

నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో గత ప్రభుత్వాలు ఇంటి స్థలాలు కేటాయించలేదు. 20 ఏళ్ల క్రితం రాఘవేంద్ర నగర్, రామచంద్రాపురంలో మాత్రమే స్థలాలు మంజూరు చేశారు. మళ్లీ 20 ఏళ్ల తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో భూములు కొనుగోలు చేసి ఇంటి స్థలాలు ఇచ్చారు. దాదాపు 1500 మందికి ప్లాట్లు కేటాయించారు. ఎమ్మిగనూరు రోడ్డులో, రాఘవేంద్ర నగర్ సమీపంలో స్థలాలు ఇచ్చారు. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే కోసిగి మండల కేంద్రంలోనూ 900 మందికిపైగా సజ్జలగుడ్డం రోడ్డులో ఇంటి స్థలాలు చూపించారు. ఊళ్లను తలపించేలా నియోజకవర్గంలో జగనన్న కాలనీలు వెలుస్తున్నాయి.

మంత్రాలయం నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల వివరాలు

మండలం	మంజూరైన సంఖ్య	ఎస్ఎస్	బీబీఎల్	బేస్‌మెంట్ లెవెల్	రూఫ్ లెవెల్	ఆర్సీ లెవెల్	పూర్తయిన ఇళ్లు
కోసిగి	3,410	0	2,194	214	159	57	759
కౌతాళం	2,209	2	1,244	219	168	32	544
మంత్రాలయం	2,606	1	1,617	449	94	29	416
పెద్దకడబూరు	1,149	1	695	96	49	39	269
మొత్తం	9,374	4	5,750	1,005	470	157	1,988

ప్రభుత్వానికి రుణ పడి ఉంటాం



మేము చాలా ఏళ్లుగా మంత్రాలయంలో కాపురం ఉంటున్నాం. ఏ ప్రభుత్వమూ ఇంటి స్థలం కేటాయించలేదు. బాడుగ ఇళ్లలో ఎన్నో అవస్థలు పడ్డాం. దాదాపు 20 ఏళ్ల తర్వాత మాకు ఇంటి స్థలం వచ్చింది. పక్కా ఇల్లు రావడంతో ఎంతో సంతోషంగా ఉంది. జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది. త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం.

– మాధవి, గృహ లబ్ధిదారురాలు, మంత్రాలయం

కల నెరవేరింది



ఇన్నాళ్లూ సొంత ఇల్లు లేక పూరి గుడిసెలో కాపురం ఉంటూ వచ్చాం. ప్రభుత్వం మాకు స్థలం కేటాయించి ఎంతో మేలు చేసింది. ఇప్పటికే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. మంచి రోజు చూసుకుని గృహ ప్రవేశం చేయాలనుకున్నాం. మా ఊర్లో చాలా మందికి ఇళ్లు మంజూరయ్యాయి. అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– అంజినయ్య, లబ్ధిదారుడు, వందగల్లు

ఫ్యాక్టరీ ఆకస్మిక తనిఖీ

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని మాధవరం గ్రామ శివారులో ఉన్న మారుతి ఇస్పాట్ ఫ్యాక్టరీని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కిరణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యాక్టరీలో ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఫ్యాక్టరీలో ఇనుము తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అక్రమ మద్యం విక్రయాలపై ఫిర్యాదు

పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు ఎస్‌ఐ శ్రీనివాసులును కోరారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రంగమ్మ, పెద్దయ్య, వారి కుమారులు, కుర్మి రఘు గ్రామంలో కర్ణాటక మద్యం, నాటుసారా విక్రయిస్తున్నారన్నారు. దీంతో మందుబాబులు గ్రామంలో గుంపులుగా చేసి మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు గురిచేస్తున్నారని వివరించారు. ఎమ్మిగనూరు సమీప గ్రామం కావడంతో పట్టణం నుంచి పలువురు బైక్‌లపై వచ్చి మద్యం తాగి మత్తులో రోడ్లపై విచ్చలవిడిగా పడిపోతున్నారన్నారు. వీరితో పాటు గ్రామంలో అక్కడక్కడా మద్యం విక్రయిస్తున్న వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో పాటు గ్రామస్తులు ఉన్నారు.

టైలర్ల అభివృద్ధికి సహకారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని పరిసర ప్రాంతాల్లోని టైలర్ల ఆర్థికాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ టైలర్ల (దర్జీలు) దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పట్టణ శివారు ఎమ్మిగనూరు రోడ్డులోని అక్షరశ్రీ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ముందు టైలర్ల అసోసియేషన్ భవనానికి స్థలం ఇవ్వాలని సంఘం సభ్యులు కోరగా ఆ హామీని నెరవేర్చామని గుర్తుచేశారు. అలాగే అసోసియేషన్‌కు పక్కా భవనం, హాలు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. టైలరింగ్‌లో పాత పద్ధతులు వీడి మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త పద్ధతులకు ఒరవడి పలకాలన్నారు. టైలర్ల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దర్జీలకు ఏటా రూ.10 వేలు సాయం అందిస్తున్నాడన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఎమ్మెల్యే లేదా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని చంద్రకాంత్‌రెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మార్కెట్ యార్డు చైర్మన్ మాబాషా, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ నియాజ్‌అహ్మద్, నాయకులు అన్నూ, తిమ్మప్ప, మజార్‌అహ్మద్, రామలింగేశ్వరయాదవ్, టైలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో జొన్న కొనుగోళ్లు


మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

హొళగుంద: రైతులు పండించిన జొన్నలకు రాష్ట్ర ప్రభుత్వం మంచి ధర కల్పించి కొనుగోలు చేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆయన మంగళవారం చిన్నహ్యాట గ్రామ సచివాలయంలో జొన్న కొనుగోలు కేంద్రం, ఇతర విషయాలపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నహ్యాట సచివాలయ పరిధిలో రైతులు సాగు చేసిన జొన్న పంట దిగుబడి వివరాలను ఆ గ్రామ వీఏఏ తస్లీమాను అడిగి తెలుసుకున్నారు. 50 మంది రైతుల వద్ద దాదాపు 200 క్వింటాళ్ల జొన్నలు నిల్వ ఉన్నాయని తెలపగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జవారి రకం జొన్నలను క్వింటాలు రూ.2,970 ప్రకారం కొనుగోలు చేస్తోందని 24 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లిస్తోందని చెప్పారు. అదేవిధంగా కూలీలు, ఖాళీ సంచులు, రవాణా చార్జీలు మిగులుతాయని రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మండలంలో జొన్న దిగుబడులు, నిల్వ ఇతర వివరాలను తహసీల్దారు హుసేన్ సాహెబ్, ఏఈఓ విరుపాక్షి, వీఏఏ తస్లీమాను అడిగి తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఖగ్గల్‌లో గ్రామసభ

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని ఖగ్గల్ గ్రామంలో తహసీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. సమావేశంలో జగనన్న భూహక్కు – భూరక్ష పత్రాల్లో ఎవైనా తప్పులు ఉంటే దరఖాస్తు చేసుకుంటే మార్పు చేస్తామని తెలిపారు. అనంతరం రాంపురం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆనంద్, వీఆర్వో ఖాసీం తదితరులు ఉన్నారు.

మేధస్సుకు పదును పెట్టాలి

మంత్రాలయం రూరల్: చదువుకునే ప్రతి విద్యార్థి మేధస్సుకు పదును పెట్టాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. ఆయన మంగళవారం మండల కేంద్రంలోని పలు పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండి ప్రస్తుత పోటీ ప్రపంచంలో దూసుకుపోవాలని సూచించారు. అనంతరం సీఐకి పాఠశాలల యాజమాన్యం శాలువాతో సత్కరించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

కృష్ణగిరి: 18వ యూత్ ఛాంపియన్ రాష్ట్రస్థాయి పోటీల్లో కంబాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జశ్వంత్ షార్ట్‌పుట్ విభాగంలో రాణించి మూడవ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ మంగళవారం తెలిపారు. ఏలూరులో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థి ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం


వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన రెండు కార్లు, ఒక ద్విచక్రవాహనం, అశోక్ లే లాండ్ ట్రక్కు వాహనాలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సీఐ శ్యాంప్రసాద్ మంగళవారం వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మొత్తం 18 మంది పాటదారులు పాల్గొని 4వాహనాలను రూ.5,45,000లకు పాట పాడి దక్కించుకున్నారు. వాహనాల వేలం ద్వారా మొత్తం జీఎస్టీతో కలుపుకుని రూ.6,43,100ల ఆదాయం వచ్చినట్లు సీఐ శ్యాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం


ఆదోనిలో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ శివరాములు

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో సర్ సీవీ రామన్ జయంతి పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవం మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, కరస్పాండెంట్‌ల ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా సైన్స్ నమూనా ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వేడుకలకు ఎంఈఓ శివరాములు పాల్గొని, విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనా ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ, సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఆదోని రూరల్: మండలంలోని సలకలకొండ ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం వెంకటరాముడు ఆధ్వర్యంలో డి.హసీనాబీ, విద్యార్థులు సైన్స్ దినోత్సవంలో భాగంగా సహజ వనరుల ద్వారా సైన్స్ హెర్బేరియంలను ప్రదర్శించారు. ప్రయోగాలను వివరించారు. సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట్‌రాముడు సార్ సీవీ రామన్ కృషిని రామన్ ఎఫెక్ట్ ఫలితాలను తెలిపారు.

శాస్త్రీయ దృక్పథమే దేశాభివృద్ధికి పునాది

పెద్దకడబూరు: శాస్త్రీయ దృక్పథమే దేశాభివృద్ధికి పునాది అని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారుచేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించారు. బాల్య వివాహాల నాటిక, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు.

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు పుల్లారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయుడు గొట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు వివిధ రకాలు సైన్స్ పరికరాలు, నమూనా ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. రాత్రిపూట ప్రమాదాలు నియంత్రించే సెన్సార్లు, రాకెట్ బెలూన్లు, మానవ జీర్ణవ్యవస్థ, టెలిస్కోప్ తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. అలాగే దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు గురుస్వామి, శరమ్మ, వెంకట రెడ్డి, జలంధర్ రెడ్డి, పీడీ ఖలీల్ అహ్మద్, శ్రీనివాసులు, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.


పెద్దకడబూరులో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కోసిగిలో సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

4 నుంచి రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



పెరవలిలోని రంగనాథుడి ఆలయం (ఇన్‌సెట్) మూలవిరాట్, ఉత్సవమూర్తులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన, కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న రంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పది రోజుల పాటు వైభవంగా నిర్వహిందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 4న ధ్వజారోహణం, 5న సింహోత్సవం, 6న శేషోత్సవం, 7న లంకోత్సవం, 8న గరుడోత్సవం, 9న గజోత్సవం, 10న స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. కల్యాణానికి నూతన వస్త్రాలు, మండపం ఏర్పాటు, అలంకరణ, రథోత్సవం, పాన్పు సేవకు గ్రామానికి చెందిన పారారామన్న కుమారులు రామచంద్రప్రసాద్, విశ్వనాథ్ పుష్పాలంకరణ చేయించనున్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, బ్రహ్మరథం సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహిస్తారు. 11న అశ్వవాహనం, 12న ఉదయం పూర్ణహుతి, వసంతోత్సవం, రాత్రి హంస వాహనం, 13న ద్వాదశ ప్రదక్షిణోత్సవాలు, రాత్రి పాన్పు సేవ ఉంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి 9 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై కొరడా

- ఆదోనిలో రూ.1.50 లక్షలు విలువచేసే కవర్లు స్వాధీనం


ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులను సీజ్ చేసిన మున్సిపల్ అధికారులు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్ల విక్రయ, వ్యాపార దుకాణాలు, గోదాములపై మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటరీ సెక్షన్ ఇన్‌స్పెక్టర్లు విస్తృతంగా దాడులు నిర్వహించారు. 'ప్లాస్టిక్‌కు నో' శీర్షికన మంగళవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. పట్టణ ప్రధాన రోడ్లలోని వ్యాపార దుకాణాలు, గుట్టుగా ప్లాస్టిక్ కవర్లను హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుంటూ దుకాణాలకు చేరవేస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్న గోదాములపై దాడులు జరిపారు. కవర్లు 120 మైక్రాన్లలోపు ఉన్నట్లుగా గుర్తించిన కమిషనర్ నిల్వ ఉన్న కవర్లు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.1.50 లక్షలు దాకా ఉంటుందన్నారు. కొంతమంది వ్యాపారులు పర్యావరణ పరిరక్షణకు సహకరించడం లేదని, వ్యాపార ధోరణితోనే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్న విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. వ్యాపారుల ధోరణి మారకపోతే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్షపునీటిని ఒడిసి పట్టాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: వర్షపునీరు వృథా కాకుండా ప్రతి బొట్టు భూమిలో ఇంకిపోయేలా ఒడిసి పట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు – వ్యవసాయ పరివర్తన పథకం అమలులో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని, వర్షపునీరు వృథాగా పోకుండా భూమిలో ఇంకిపోయేలా చూడాలన్నారు. రైతులు తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు వచ్చే పంటలను సాగుచేసుకోవాన్నారు. సూక్ష్మబిందు సేద్యం, పొదుపుగా నీటి వనరుల వినియోగంపై ఏడీఏ వెంకటేశ్వర్లు, సాంకేతిక వ్యవసాయ అధికారి అల్లిపీర, ఏఓ మల్లేష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఖాదర్‌వలి, సిబ్బంది, రైతులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన ఎరుకలి తిమ్మప్ప

హొళగుంద: స్థానిక సమ్మతగేరి క్రాస్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎరుకలి తిమ్మప్ప (34) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్రం సింధనూరు తాలూకా రౌడకుంద గ్రామానికి ఎరుకల తిమ్మప్ప కొన్నేళ్ల కిందట సుళువాయి గ్రామానికి చెందిన సుశీల అనే మహిళను వివాహం చేసుకుని ఇక్కడే నివాసం ఉంటున్నాడు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తిమ్మప్ప మంగళవారం రాత్రి హొళగుందలో ఓ శుభ కార్యంలో బ్యాండు మేళం వాయించేందుకు బైక్‌పై వెళుతుండగా సమ్మతగేరి క్రాస్ వద్ద మరో బైక్‌పై వస్తున్న సుళువాయికి చెందిన శివప్ప, రమేశ్‌లను ఢీకొట్టాడు. ప్రమాదంలో తిమ్మప్ప తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై వచ్చిన శివప్ప, రమేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హొళగుంద ఎస్‌ఐ అబ్దుల్‌జహీర్ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం ఆలూరుకు తరలించారు. తిమ్మప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలూరుకు తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రెండు గడ్డివాముల దగ్ధం

ఆలూరు రూరల్/హాలహర్వి: హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామంలో మంగళవారం సాయంత్రం నిప్పంటుకుని రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన షఫివుల్లాతో పాటు మరో రైతుకు చెందిన పశుగ్రాసం మంటల్లో కాలి బూడిదైంది. గ్రామస్తులు ఫైర్ అధికారులకు సమాచారం అందించగా.. ఫైర్ సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.60 వేలు విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైనట్లు ఫైర్ అధికారి ఖాద్రి తెలిపారు.